క్లుప్తంగా

అభ్యంతరాలుంటే చెప్పండి



పెనమలూరు: ఓటర్ల సర్వేలో అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి వెంటనే తీసుకురావాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయపార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటశివయ్య మాట్లాడుతూ గత నెల 21వ తేదీ నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెనమలూరు నియోజకవర్గ పరిధిలో ఇంటింటి ఓటర్ల సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటికే బూత్‌లెవల్ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేస్తున్నారన్నారు. బీఎల్‌వోలో చేస్తున్న సర్వేలో లోటుపాట్లు ఉంటే ఆయా రాజకీయ పార్టీ నేతలు వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీఎల్‌వోల సర్వేకు ఆయా రాజకీయపార్టీ నేతలు కూడా సహకరించి తగిన సూచనలు ఇస్తే స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, మునిసిపాలిటీ అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



పెనమలూరు: ఉత్తమ ప్రతిభ చాటిన ఇంజినీరింగ్ విద్యార్థులకు అమెరికాకు చెందిన నార్త్, సౌత్ ఫౌండేషన్ ఉపకార వేతనాలు పంపిణీ చేసింది. ఈ మేరకు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.1.70 లక్షలు ఉపకార వేతనాలు విజయవాడ చాప్టర్ నార్త్, సౌత్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సూరపనేని వెంకటరత్నం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల ప్రసాద్, ప్రొఫెసర్ డాక్టర్ హరిప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు గ్రామానికి చెందిన లంకా జ్యోతి గత 2016లో ఘంటశాల మండలం తెలుగురావుపాలెంకు చెందిన లాంకా రమేష్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరికి పాప పుట్టింది. భర్త రమేష్ గుడ్లవల్లేరు కాలేజీలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. కాగా పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు చాల్లేదని భర్త, అత్తింటివారు వేధిస్తుండటంతో బాధితురాలు పుట్టింటికి వచ్చి పోలీసులను ఆశ్రయించింది. భర్తతోపాటు మామ రాజారావు, బావ సాంబశివరావు, తోటికోడలు ప్రమీళా, ఆడపడుచు సంతోషమ్మపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వేలేరు మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ నేడు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వేలేరులో గురువారం మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యాన అధికారి హరిచంద్ బుధవారం తెలిపారు. జాతీయ స్థాయిలో చేపట్టిన మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉద్యాన శాఖ, పతాంజలి ఫుడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో వేలేరులో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతామన్నారు. అనంతరం సస్యరక్షణ చర్యలపై రైతులకు ఉద్యాన శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆయిల్‌పామ్ రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత కంటి వైద్య సేవలు వినియోగించుకోవాలి



కంకిపాడు: ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు కోరారు. కంకిపాడు పట్టణంలో వాసవీ ఆప్టికల్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను చాటడం అభినందనీయమన్నారు. ఆప్టికల్స్ సీఈఓ వెలివెల రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఉచిత కంటి పరీక్షలు జరుగుతాయన్నారు. దృష్టి సమస్యలు ఉన్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్, కంకిపాడు సబ్‌సెంటర్ మెడికల్ ఆఫీసర్ సుధా ప్రసూజ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండి నాంచారయ్య పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపాల నివారణే ప్రభుత్వ లక్ష్యం



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం కిట్‌లను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు, అధికారులు

కంకిపాడు: పౌష్టికాహార లోపాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో పౌష్టికాహార కిట్‌ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ పౌష్టికాహార కిట్‌ల ద్వారా రక్తహీనత నివారణ, ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి దోహదపడుతుందన్నారు. తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, సీడీపీఓ కె.బి.సుకన్య, ప్రాజెక్టు సూపర్‌వైజర్లు ఎస్.అన్నామణి, ఎస్.సత్య, జి.విజయలక్ష్మి, టి.రమానాగమణి, ఎం.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.నళినీకుమారి, కె.భవాని, ఎం.రత్నకుమారి, డి.లక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని పునాదిపాడులోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముసిబోయిన వెంకటేశ్వరరావు, ఈఓ బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లులకు ఆరోగ్య సంరక్షణ..

పెనమలూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణతో తల్లులకు ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. పెనమలూరు 1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. గోసాల గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి సంగెపు శ్రీనివాసరావు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. పెదపులిపాకలో జరిగిన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణులకు గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి కిట్లు పంపిణీ చేశారు. గంగూరులో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత అక్బర్‌పాషా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు తల్లులకు అందచేశారు. కానూరులో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. యనమలకుదురు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌కే, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ల ఆధ్వర్యంలో గర్భిణులు ,తల్లులకు కిట్లు అందించారు.

క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలి

రామవరప్పాడు: బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి తెలిపారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు కళ్యాణ మండపంలో బుధవారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాలకు సంబంధించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎనికేపాడు, రామవరప్పాడు, నిడమనూరు సర్పంచ్‌లు రాచమళ్ల పూర్ణచంద్రరావు, వరి శ్రీదేవి, శీలం రంగారావు పాల్గొన్నారు.



గోసాలలో కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి సంగెపు శ్రీనివాసరావు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, బాలింతలకు ఉచితంగా అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని తెలిపారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను బుధవారం నున్న గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అందజేశారు. మహిళా వార్డు సభ్యులు బొట్టా అరుణ, షేక్ సైదాబీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు. పాతపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ పోషణ కిట్‌లు పంపిణీ చేశారు. గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులకు కిట్‌లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు బాలకోటేశ్వరరావు, ఉప సర్పంచ్ మరీదు స్వప్న పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల పోషకాలు కలిగిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్నారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు బుధవారం పంపిణీ చేశారు. పొట్టిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మాదేవి, సర్పంచ్ కత్తుల జ్యోతి పాల్గొన్నారు.



పొట్టిపాడులో కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సరోజిని



గోపవరపుగూడెంలో కిట్ అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు



నున్నలో కిట్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ వరం

గన్నవరంరూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ వరం వంటిదని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్‌ను బుధవారం ఆయన పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యం

గన్నవరంరూరల్: గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామంలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు సూచించారు. రూ.16 లక్షలతో నిర్మించే రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి బాలలకు అందిస్తున్న పౌష్టికాహారం పరిశీలించి, రోజు వారీ వస్తున్న బాలల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు ఇంటి వద్దకే నాణ్యమైన వైద్యం అందిస్తోందని చెప్పారు. ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి గ్రామస్తులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

ఎమ్మెల్యే వంశీ దాతృత్వంతో వాటర్ ప్లాంట్ మిషనరీ రాక

కొత్తగూడెం గ్రామంలో వాటర్ ప్లాంట్ లేక ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు మంచినీటికి ఇక్కట్లు పడుతున్నారు. నీటి సమస్య పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ గ్రామస్తుల ప్రయోజనార్థం రూ.5 లక్షలు విలువ చేసే వాటర్ ప్లాంట్ మిషనరీని వితరణగా అందజేశారు. ఈ వాటర్ ప్లాంట్ మిషనరీ, మెటీరియల్‌ను ఎంపీపీ గ్రామస్తులకు అందించారు. ఈ గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ లేకపోవటంతో గ్రామస్తులు దూరంగా ఉన్న వీరపనేనిగూడెం, చిక్కవరం గ్రామాలకు వెళ్లి మంచి నీటిని తెచ్చుకుంటున్నారని, గ్రామస్తుల ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే దాతృత్వంతో వాటర్ ప్లాంటుకు మిషనరీని పంపారని చెప్పారు. అనంతరం గ్రామ రైతుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే వంశీ దాతృత్వంతో ఏర్పాటు చేసిన సాగునీటి సరఫరా మోటార్లను ఎంపీపీ పూజలు చేసి నీటిని పంట కాలువలకు వదిలారు. పోలవరం నీటిని రైతాంగం కోసం వినియోగించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా సకాలంలో నీటి మోటార్లు బిగించిన ఎమ్మెల్యేకు అన్నదాతలు కృతజ్ఞతలు తెలిపారు. 400 ఎకరాలు కొత్తగూడెం ఆయకట్టు ప్రతి సంవత్సరం పండిస్తున్నామంటే అది ఎమ్మెల్యే చలవేనని రైతులు పేర్కొన్నారు. సర్పంచ్ తూంపాటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్ దుర్గా, వైఎస్సార్ సీపీ నాయకులు కృష్ణారావు, ఏడుకొండలు, అంగడాల సాంబశివరావు, చిలకపాటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీపీ రవి, సర్పంచ్ రాంబాబు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గన్నవరంరూరల్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని వీరపనేనిగూడెంలో రెండు రహదారుల నిర్మాణానికి ఆయన సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మతో కలిసి బుధవారం శంకుస్థాపనలు చేశారు. పేద ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించే ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని చెప్పారు. పేదల అభ్యున్నతి సీఎం లక్ష్యమన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. ఉప సర్పంచ్ బి.నాగ సాంబిరెడ్డి, సొసైటీ చైర్మన్ బి.శ్రీనివాసరెడ్డి, బత్తుల లోకేశ్వరరెడ్డి, నందిపాటి సుబ్బారెడ్డి, పంచాయితీ కార్యదర్శి బాపూజీ, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ బత్తుల పానకాలు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: విద్యుత్ లైన్లను ఆధునీకీకరించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కానూరులో తన కార్యాలయంలో ఉయ్యూరు టౌన్, ఉయ్యూరు రూరల్ విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. తాను ఉయ్యూరులో గడపగడప కార్యక్రమంలో పర్యటించిన సమయంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రధానంగా విద్యుత్ తీగలు కిందకు వేలాడటం, ఇళ్ల పై నుంచి విద్యుత్ తీగలు ఉండటం, విద్యుత్ స్తంభాలు సక్రమంగా లేక పోవటం ఇలా అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. అధికారులు ప్రతి గ్రామంలో, ఉయ్యూరు టౌన్‌లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి పూర్తిచేయాలన్నారు. విద్యుత్ పనులకు అయ్యే ఖర్చు తాను ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి వెంటనే ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనులు చేసి త్వరగా సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని నాని, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పథకాలు అమలు చేస్తుందన్నారు. అర్హులందరూ పథకాలు లబ్ధి పొందేలా పాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చిందన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల ప్రగతి, ఆస్పత్రుల అభివృద్ధి, వ్యవసాయానికి చేయూత, అన్ని రంగాల ప్రజలకు మెరుగైన సేవలు సీఎం జగన్ పాలనలో అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ గోన మదన్, షాదీఖానా చైర్మన్ మహ్మద్ ఖాన్, నాయకులు రాజులపాటి రామచంద్రరావు, వడుపు కార్తీక్, అబ్దుల్ సద్దాం, కొండపల్లి రమేష్, అడపాక రాంబాబు, సయ్యద్ అమీన్, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

వేరు పురుగు నివారణతో చెరకు పైరు సంరక్షణ

ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



కంకిపాడు: వేరు పురుగు నివారణతో చెరకు పంటను సంరక్షించుకోవచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త (కీటక నివారణ విభాగం) డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని కంకిపాడు, దావులూరు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, గరికపర్రు, యాకమూరు గ్రామాల్లో ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం, కేసీపీ సిబ్బంది బృందం బుధవారం విస్తృతంగా పర్యటించింది. క్షేత్రస్థాయి పర్యటనలో చెరకు పైరులో వేరు పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ వేరుపురుగులు తొలి దశలో ఆశిస్తే మొవ్వ ఎండిపోతుందన్నారు. వేరు, కాండాన్ని ఆశించటం ద్వారా మొక్క చనిపోతుందన్నారు. ఎదిగిన తోటల్లో పురుగు ఉధృతితో 30-40 శాతం పంట నష్టం ఏర్పడుతుందన్నారు. పురుగు ఉధృతి మధ్యస్తంగా ఉంటే క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా క్వినాల్ఫాస్ 2.0 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే ఇమిడా క్లోప్రిడ్, ఫిప్రోనిల్ 1.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వచ్చే నెలలో చెరకు పైరులో పురుగు సమస్య లేకుండా ఉండేందుకు పొలం చుట్టూ ఉండే రేగు, తుమ్మ, వేప కొమ్మలను కత్తించాలన్నారు.

• గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గన్నవరం సబ్‌స్టేషన్ పరిధిలోని పురుషోత్తపట్నం, కొండపావులూరుల్లో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు తెలిపారు.

ఏటిపాయకు తగ్గిన వరద



ఏటిపాయలో వరదనీటికి ధ్వంసమైన రహదారి

కంకిపాడు: ఏటిపాయకు వరదనీరు తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఆగటంతో ప్రకాశం బ్యారేజీకి వచ్చి చేరే వరదనీరు తగ్గింది. దీంతో ఏటిపాయలో వరదనీరు తగ్గినట్లయ్యింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఉపనదులు ఉప్పొంగి ప్రవహించటంతో ప్రకాశం బ్యారేజీకి వరదనీరు భారీగా వచ్చి చేరిన విషయం తెలిసిందే. దీంతో బ్యారేజీ వద్ద నీటి మట్టాన్ని స్థిరీకరిస్తూ ఇరిగేషన్ అధికారులు వరదనీటిని సముద్రంలోకి విడుదల చేయటంతో కృష్ణానది ఏటిపాయ వరదనీటితో ఉధృతంగా ప్రవహించింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గుండా ప్రవహించే ఏటిపాయలో లోపల పాయ అంచులు తాకుతూ వరదనీరు సముద్రం వైపు సాగింది. వరదనీటి చేరికతో మద్దూరు వద్ద ఏటిపాయలో రాకపోకలకు వీలుగా నిర్మించిన రబ్బిష్ రహదారి పూర్తిగా నీట మునిగి, పాయలోపల ఉన్న లంక భూములకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం రహదారి మార్గం బయట పడింది. అయితే నీటి ఉధృతి రహదారి మార్గం కోతకు గురైంది. కేవలం రైతులు, కూలీలు కాలినడకన లంక భూముల్లోకి వెళ్లేందుకు వీలుగా మాత్రమే రహదారి ఉంది. అది కూడా అతి జాగ్రత్తగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. రహదారి మార్గం మరమ్మతులు చేపడితేనే లంక భూముల్లోకి వాహనాలు, యంత్ర పరికరాలు వెళ్లటానికి ఆస్కారం ఉంటుంది. అయితే ఏటిపాయ అవతల గుంటూరు జిల్లాలోని లంక ప్రాంత గ్రామాలైన గొడవర్రు, వల్లభాపురం, కొల్లిపర, మున్నంగి గ్రామాలకు వెళ్లేందుకు ఇంకా రాకపోకలు పునరుద్ధరణ కాని పరిస్థితి. ఇంకా రెండు, మూడు రోజుల్లో ఏటిపాయలోనీటి ప్రవాహం సాధారణ స్థితికి చేరుకుంటుందని రైతులు భావిస్తున్నారు. మద్దూరు పుష్కరఘాట్ వద్ద ఉన్న శివ మందిరం పరిసరాలు ఎగువ నుంచి కొట్టుకొచ్చిన ఒండ్రు, గుర్రపుడెక్క, వ్యర్థాలతో నిండిపోయి అపరిశుభ్రంగా తయారైంది.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పెనమలూరు: కానూరులో బుధవారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా చేశారు. మాతృహృదయ్ సేవా సంఘ్, అశోక్ జిమ్ బాడీ బిల్డింగ్ క్రీడాకారుల ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య ఫొటోకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ జాతీయ జెండాను ఎగురవేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో జన్మించిన పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించి తెలుగు జాతి కీర్తిని చాటారన్నారు. పింగళి వెంకయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు షాజిద్, ఇలియాస్, జశ్వంత్, బషీర్ పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను నేటి యువత తెలుసుకుని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్‌డీ బాషా, ఎంఈవో-2 సాంబశివరావు పాల్గొన్నారు.

జంక్షన్‌లో నివాళి..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని హనుమాన్‌జంక్షన్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలోని పింగళి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి పింగళి వెంకయ్య అని మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు కొనియాడారు. జాతీయ పతాక ప్రచారకర్త షేక్ మాబు సుభాని, నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ యదునందనరావు, మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు కొట్నాని రామచంద్రరావు, చెక్కా సుబ్బారావు, పొట్లూరి శేషాచలం, కన్నికంటి సుబ్బారావు, వడ్డీ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన పింఛన్‌ల పంపిణీ



తాడిగడపలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్

పెనమలూరు: మండల పరిధిలో రెండో రోజు కూడా లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్ము పంపిణీ చేశారు. పెనమలూరు, తాడిగడప మునిసిపాలిటీలో మొత్తం పింఛన్ లబ్ధిదారులు 17,713 మంది ఉన్నారు. మొదటి రోజు మంగళవారం పెనమలూరు మండలంలో 80 శాతం, తాడిగడప మునిసిపాలిటీలో 75 శాతం చొప్పున పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. తాడిగడప కార్మికనగర్ సచివాలయం 2లో చేబ్రోలు చిన్నమ్మడుకు ఫేస్‌యాప్ ద్వారా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రంజిత్‌కుమార్ పింఛన్ అందజేశారు.

గన్నవరంరూరల్: సచివాలయాల సిబ్బంది సేవలకు సర్వత్రా ప్రశంసలు అందుతున్నాయి. మండలంలోని ముస్తాబాద-2 సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ చిన్ని సురేష్ గుంటూరు జిల్లాలోని ఎయిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బుధవారం పెన్షన్ అందజేశారు. సచివాలయం పరిధిలో పెన్షన్ తీసుకునే ఎద్దు రజిని అనారోగ్య కారణంగా చికిత్స పొందుతుండటంతో విషయం తెలుసుకుని చిన్ని సురేష్ స్వయంగా వెళ్లి ఆస్పత్రిలో పెన్షన్ అందజేశాడు.